# శత్రువు

కాన్‌స్టేబుల్ అటెన్షన్‌లో నిలబడి, నాడాలున్న బూటుకాలు నేల కేసి ఓ బాదు బాది శాల్యూట్ చేసి, "సార్" అన్నాడు!

ఎస్. ఐ. తలెత్తలేదు. టేబుల్‌మీద వాలి ఉన్న అతని దృష్టిలో ఖరీదైన బిల్లులు కొస్తున్నాయి. వాటిని పట్టుకునున్న అతని చేతికో ఖరీదైన వాచీ స్మగుల్డుగా మెరుస్తోంది. రెండో చేతిలో ఉన్న చవకరకం ఆఫీసు కలం ఆ బిల్లులోని మొత్తాల్ని కూడుతోంది.

కూడగా తేలినఅంకెల మొత్తం ఎస్. ఐ. గారి నరాల్ని పీకుతోంది. అంతా కలిసి దాదాపు రెండు వేల రూపాయల చిల్లర. ఒక్కరోజులో, అక్షరాలా ఇరవైనాలు గ్గంటల్లో తనకు క్షవరమయిన మొత్తం అది.

రెండువేల రూపాయలు! తక్కువా? తొంభై రోజుల జీతం! ట్రాఫిక్‌వింగ్‌లో ఉన్నప్పటి స్వర్ణదినాల్లో లారీలవాళ్ళని, ఎడ్లబళ్ళవాళ్ళని తోపుడు బండ్లవాళ్ళని, రోడ్డుమీద కూరగాయల ముసలమ్మల్ని, పేవ్ మెంట్ షాపులవాళ్ళని అదరగొడితే రెండునెల్ల కోసారి తన వాటాకు రాలి పడే మొత్తం!

అంత మొత్తం ఇరవై నాలుగ్గంటల్లో రెక్కలొచ్చినట్లెగిరిపోయింది. సీసాల్లోంచి బీరుగా, బ్రాందీగా, విస్కీగా మారి కారిపోయింది చికెన్ బిర్యానీల్లో, రోస్టుల్లో మసాలాగా కలిసి మాయమయ్యింది.

అయితేనేం గాక! ఉద్యోగాన్ని నిలబెట్టింది!

రెండు వేల రూపాయల కోసం బాధలేదు. తనేం ఆస్తిపాస్తుల్లేని బికారిగాడు కాడు. పై సంపాదన చేతగాని చవటకాడు.

కానీ ... కానీ ... ఉత్తపుణ్యానికి ... ! ఒక్కరోజులో ... ఇరవై నాలుగ్గంటల్లో... !

ఏభై రూపాయలు తిన్నందుకు రెండువేల రూపాయలా కక్కాల్సింది : మూడేళ్ళనాటి యాభై రూపాయల ముడుపుకు పడ్డీలా నిన్న ఒక్కరోజులో కక్కింది రెండువేల రూపాయలా !

ఆ యాభై రూపాయలకు ఆ నాడు తనేం అన్యాయంగా కక్కుర్తి పడలేదు. ఏ ఒక్కవాడినీ పీక్కు తినలేదు. ఏ ఇల్లాలి మంగళసూత్రమూ అమ్మించలేదు. కనీసం తాకట్టేనా పెట్టించలేదు.

ఇచ్చినవాడు కొవ్వెక్కి ఉన్నవాడే ! ఇచ్చుకున్నది వాణ్ణి అన్యాయంగా రక్షించుకోడానికే !

వచ్చిన ఇబ్బందల్లా అప్పుడు తాను తాలూకా సెంటర్లో పన్జేస్తున్నాడు. వాడేమో ఆ ఊళ్ళో ఓ బుడ్డ లీడరుగా వెలుగుతున్నాడు. వాడి పేటలో వాడిదే రాజ్యం. వాడే మంత్రి, వాడే ఐ. జి. ఆఫ్ పోలీస్ కూడా !

ఆ సంగతి రుజూ చేసేందుకుగాను వాడు మరొకడి కొంప తగలేయించేడు ! అదే మన్నందుకు వాడి బొమికెల్ని అతుక్కు వీల్లేకుండా మరీ విరగదన్నించేడు ! జబ్బ చరిచి, దిక్కున్నచోట చెప్పుకు చావరా అని మీసం మెలేసేడు.

ఆ మీసం ఇరవైనాలు గ్గంట్లలో రెండువేల రూపాయల్ని తగలేయించ గలంతటిదని అప్పట్లో తాననుకోలేదు. వాడిపేటలో వాడేం చేసు

కున్నా తనకు అభ్యంతరం లేదుగాక లేదు. వాడిపేటకు వాడు మకుటంలేని రాజే కావచ్చుగాక ! అలాంటివాళ్ళీ దేశంలో ఈ ఊళ్లో చాలా మందే వున్నారు. మళ్ళీ మాట్లాడితే. వాడి మీసంలో వెంట్రుకలంత మంది ఉన్నారు. కానీ తాను మాత్రం ఊరు మొత్తానికే మకుటం ఉన్న మహా రాజుగదా !

మరి వాడు మర్యాదకోసమన్నా ఆ చేసేదేదో ముందుగా తనతో చెప్పి మరీ చేసి చావగూడదా ? పోనీ, ఆ తర్వాతనన్నా చెప్పి చెంపలేసు కొని తన శరణు కోరగూడదా ?

అబ్బె ! వాడదేం చేయలేదు. పైగా నాలుగు బుడ్లు తెప్పించుకొని పీకలదాకా తాగి మంచానికడ్డంపడి నిద్రపోయేట్ట ! తీరా ఆ కొంప కాలిన లోమికెలు విరిగినవాడి తాలూకు ఓ యాభై మంది ఊరేగుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చి గొడవచేసి కేసు రిజిష్టరు చేయించుకెళ్ళాక తీరిగ్గా దయ చేసేడు.

అప్పుడయినా ఎలా వచ్చేడు ? తను కబురు చేయిస్తే వచ్చేడు ! ఇద్దరు కానిస్టేబుల్స్‌ని పంపగా మంత్రిగారిలా ఎస్కార్టుతో వచ్చేడు. గుప్పెడు గుప్పెడు గుబురు మీసాలకు ఏదో రాసుకుని, నున్నగా దువ్వు కుని, వాటిని నిమురుకుంటూ వేంచేశేడు. "ఏం బాబూ ! కులాసాగా ఉన్నారా ?" అంటూ తన మామగారి అన్నలా పలుకరిస్తూ లోపలి కొచ్చేడు.

వాడి ఆ వెధవ దర్జా, ఫోజు చూస్తే తనకు మండుకువచ్చిన మాట నిజం. అప్పుడు తాను ఆఫీసులో తన కెదురుగానే వ్రేలాడుతూన్న గాంధీ గారి పటాన్ని చూశాడు గానీ, ఆ గాంధీగారు నెత్తీ నోరూ బాదుకుని మరీ చెప్పిన శాంతి సహనాల సంగతి మాత్రం మరచిపోయేడు. ఆ బుడ్డలీడరు

గాడికి తన సత్తా ఏమిటో చూపించేడు. తన పవర్లన్నీ వాడిముందు పరచేడు. రిజిస్టరు తెప్పించి రాసిన కేసు చదివి మరీ వినిపించేడు. "బోడి మీసాలూ, నువ్వూనూ! నా పవర్లముందు నీ రాజకీయాలు బలాదూర్రా నాయనా!" అని చెప్పకుండానే చెప్పాడు! నీ రాజకీయాలు నా పవరుకు సబార్డినేట్ మాత్రమేరా బుల్లి మీసాల బుడ్డ లీడరూ! అనికూడా ఇండైరెక్టుగా రుజూ చేశాడు. మొత్తంమీద వాణ్ణి అదరగొట్టి, బెదరగొట్టి వాడిచేత బ్రతిమాలించుకునేదాకా వాడిని క్రిందికి లాగేడు. ఓ యాభై రూపాయలతో దయదలచి వాడి మీసాల పరువు నిలబెట్టేడు.

ఆ మీసాలిప్పుడు వాటి పవర్సేమిటో చూపించేయి. తడాఖా ఏమిటో తెలియ జెప్పేయి. తాను పొరపడ్డాడు. తన పవర్సు వాడిలాంటివాళ్ళ రాజకీయాలకు సబార్డినేటు మాత్రమేనని అప్పుడే తేలిపోయింది. తనటోపీ మీది ఇత్తడి మకుటంకన్నా ఏ మకుటమూ లేని ఆ తెల్లటోపీ పేట లీడరి రాజకీయ మీసాలే గొప్పవని గత నలభై ఎనిమిది గంటల్లోనూ స్పష్టంగా రుజూ అయి పోయింది.

తన అదృష్టం కొద్దీ రెండేళ్ళనాడే, ఆ తిరపతి వెంకన్న దయకొద్దీ తనకు ప్రమోషనొచ్చి సిటీకి ట్రాన్స్ఫరై కామధేనువులాంటి ఈ సీట్లో కొచ్చి పడ్డాడు, కానీ, తాను కలలోకూడా అనుకోని విధంగా, రకరకాల ఉద్యమాల పుణ్యమా అని ఆ బుల్లిమీసాల బుడ్డ పేటలీడరుగాడు ఊరికే లీడరయి కూర్చున్నాడు. వాడి గురువొకడు అమాంతం మంత్రి అయి పోయేడు. వాళ్ళ గుబురు మీసాలమధ్య తన ఉద్యోగాన్ని ఇరికించి సడెన్గా సస్పెన్షన్ ఆర్డర్ పుట్టించేరు.

ఆ ఊళ్ళో ఉన్నంత కాలం వాడు తనతో మంచిగానే ఉన్నాడు. కనపడ్డప్పుడల్లా నవ్వుతూ నమస్కారాలు చేసేవాడు. "కులాసానా!

బాబూ !" అంటూ తన పెద్దరికాన్ని వెలగబెట్టేవాడు. ఆ మర్యాదల వెనక అంతకసి దాగి ఉందనుకోలేదు. ఆ చిరునవ్వుల వెనక యాభై రూపాయలూ వడ్డీతో సహా మెరుస్తూందనుకోలేదు. ఆ నమస్కారాల వెనుక "నా తడాఖా చూపేరోజు రాకపోతుందా ? నువ్వే నాకు దండాలు పెట్టే గతి పట్టకపోతుందా ?" అనే ధీమా ఉందని తాను చూచాయగా కూడా పసిగట్టలేదు.

వాడిప్పుడు తన ప్రతాపం చూపించేడు. ఆ మధ్య ఏదో ఫంక్షనుకు మంత్రిగారితోపాటు వేంచేసిన వాడు తనను గుర్తుపట్టి పలకరించేడు. "ఇక్కడున్నావా !" అని పరామర్శించేడు. మరచిపోకుండా శిష్యులచేత పిటీషన్లు పెట్టించేడు. గురువుగారికి చెప్పి గప్ చిప్‌గా సస్పెన్షన్ ఆర్డర్లు పుట్టించేడు. రేపు అసలు తన ఉద్యోగమే ఊడే పరిస్థితుల్ని సృష్టించేడు.

ఇంకా నయం. ఆ ఆర్డరు సంతకాలయి తనదాకా రాకముందే ఇంకా టైపుకూడా కాకముందే తనకు తెలిసిపోయింది. ఆ రోజంతా తాను గడగడ లాడిపోయేడు. గజగజ వణికిపోయేడు. ఇంతదాకా కథ నడిచాక, ఫైలు పరుగెత్తాక తాను చేయగలిగింది లేదు. అవతల పెద్దతలకాయలున్నాయి. వాటిమీద ఖరీదైన తెల్లటోపీ లున్నాయి. తాను ఒక్కడూ వాటికి ఎదురు నిలవలేడు. నిలిచి బ్రతకలేడు.

ఎలా... ? ఎలా... ?

పిలక దొరక్కపోతే చేతులూ, అవీ అందకపోతే కాళ్ళూ...పట్టుకోమన్నారే... ! ఎవరూ... ? గాంధీగారేనా ? అందులో తప్పేంలేదంటారు ! ఎవరో దేవుడి ఫాదరే గాడిద కాళ్ళు పట్టుకున్నాట్ట గదా !

వెళ్ళి ఆ బుల్లిమీసాల బుడ్డలీడరుగాడి కాళ్ళే పట్టుకుందామా ! వాడి

టోపీకే మొక్కదామా, వాడి మీసాలనే ప్రార్థిద్దామా - అనుకున్నాడు మొదట తాను. వేరేదారి కనుపించలేదు. వెధవ పరువు. ఉద్యోగమే ఊడుతూంటే ఇంకా పరువెక్కడిది. నెత్తిన ఈ టోపీయేలేకుంటే వంటిన ఈ యూనిఫారమే లేకుంటే, తనకు సలాములు కొట్టేవా రెవరు? కనీసం తన మొహం చూసే వాడెవడు?

కానీ...! కానీ...!

పూలదండలు వేయించుకున్న చోటే బొగ్గులమ్మటమా! తనకు దణ్ణాలు పెట్టిన వాడి కాళ్ళకే తాను మాలిష్ చేయటమా!

అప్పుడు అకస్మాత్తుగా గుర్తుకొచ్చేరు ఛైర్మన్‌గారు.

ఆయనతో పరిచయముందేగానీ దోస్తీలేదు. కానీ, ఆయన్నెరుగనివారు లేరు. ఆయనెరుగనివారూ లేరు. అయన సత్తా జగద్విఖ్యాతం. మంత్రులకు ఆంతరంగికుడు. ఆఫీసర్లకు మొగుడు! చిన్న పనులకు ఆయనసలు కాలే కదపనవసరం లేదు. ఆయన టెలిఫోన్ బిల్లుతో రెండు ఎన్జీవో కుటుంబాలు ఆఫీసర్ కుటుంబాల్లా బ్రతకవచ్చు నంటారాయన తడాఖా తెలిసినవాళ్ళు. ఆయన వాహనాల కయే పెట్రోల్ బిల్లుతో రెండేళ్ళకో మేడ చొప్పున కట్టుకోవచ్చు నంటారు పైరవీల్లో తలలునెరిసినవాళ్లు.

అవేవీ అబద్ధాలుగానీ అతిశయోక్తులుగానీ కావని తానీ నలభై ఎనిమిది గంటల్లోను రుజూపర్చు కున్నాడు. ఆయన శరణు కోరిన ఎనిమిది గంటల్లోగా తన సస్పెన్షన్ ఆర్డర్ను సస్పెన్షన్‌లో పెట్టించేడు. ఏ కళనున్నాడోగానీ ఇంత ఖర్చవుతుంది, అంత ఖర్చవుతుందీ అని దీర్ఘాలు తీయలేదు. ముందు సంగతంతా ఉన్నదున్నట్లు వివరించ మన్నాడు!

తాను చెప్పేడు! దాపరికం లేకుండానే చెప్పేడు! నిజమే! ఏదో

గడ్డి తిన్నాను! అయినా ఏభై రూపాయలకు... ముష్టి ఏభై రూపాయలకు ఇంత కక్షా? శిక్షా? అని ఏడ్చేడు. పరువు నిలబెట్టమన్నాడు. ఉద్యోగం ఊడినా బ్రతగ్గలనుగానీ, పరువుపోతే మాత్రం తలెత్తుకోలేనని ఆయన కాళ్ళట్టుకున్నాడు. తన ముత్తాతలూ ఆయన ముత్తాతలూ దూరపు బంధువులేనని కొన్ని సాక్ష్యాలు చూపేడు. ఇద్దరం ఒకే జిల్లావాళ్ళం అనిరుజూ చేసుకున్నాడు. ఆ బుల్లిమీసాల బుడ్డలీడరూ, వాడి గురువూ ఛైర్మన్‌గారి అపోజిషన్ గ్రూపులోవాళ్ళేననికూడా వివరించేడు.

ఆయన దయదలిచేడు. టాక్సీలు తెప్పించేడు. వందిమాగధుల్తో కదిలేడు. దగ్గరుండి సెక్రటేరియట్ గేట్లు తెరిపించేడు. ఫైళ్ళు రప్పించేడు. అంతా మెరుపులా జరిగిపోయింది. సస్పెన్షన్ సస్పెండయ్యింది. తను ఊపిరి తీసుకున్నాడు! తిరుపతి వెంకన్నకు జుట్టూ, మీసాలూ మొక్కుకున్నాడు.

వందిమాగధులు అక్కణ్ణించి సరాసరి కొండమీదిబార్‌కు టాక్సీలు మళ్ళించేరు. ఛైర్మన్‌గారి ఖ్యాతినివర్ణిస్తూ పంచరత్నాలు చదివేరు. ఆయన పలుకుబడిని కీర్తిస్తూ సీసాలు ఖాళీచేసేరు. ఆయన గొప్పదనానికి జోహార్లు పలుకుతూ కోళ్ళనుమింగేరు. ఆయన ఆయురారోగ్యాలకై దేవుణ్ణిప్రార్థిస్తూ ఫోనుమీద వచ్చి వాలిన అమ్మాయిల్ని కొరికేరు, నమిలేరు.

అయితేనేంగాక! ఉద్యోగం నిలిచింది, పరువు దక్కింది.

ఆ ఖర్చులన్నీ లెక్కచూసుకుంటే రెండువేలదాకా తేలిందిప్పుడు. నయమే! ఈ మాత్రంతో సరిపోయింది. ఉద్యోగమంటూ నిలవాలేకానీ ఈ టోపీ ఎంతయినా చేసిపెట్టగలదు, రాబట్టగలదు!

కాన్‌స్టేబుల్ విసుగ్గా, భయంగా, వినయంగా నాడాల బూటుకాలు మళ్ళీ నేలకేసి ఓ బాదు బాది, శాల్యూట్‌చేసి "సార్" అన్నాడు.

ఎస్. ఐ. తలెత్తాడు. కానిస్టేబుల్‌ది తెలిసిన మొహమే. కానీ, అతని వెనక ఓ తెలీని మొహం వుంది. అది ఆడమొహం! లేతదనం ఇంకా ముదరని మొహం! అమాయకత్వం వదలని మొహం! ఇదివర కెప్పుడూ స్టేషన్‌కు వచ్చిందాన్లా లేదా మొహం. కనీసం రాత్రి బార్‌కు వచ్చి వాలిన మందలోని హైక్లాస్ మొహాల్లాకూడా లేదది.

"నాకు తెలిసిన వాళ్ళమ్మాయండీ! ఎవడో రౌడీ చేయి చేసు కున్నాట్ట!" అంటూ "చెప్పమ్మా!" అని ప్రక్కకు తప్పుకున్నాడు కానిస్టేబుల్.

అప్పుడామెను పూర్తిగా చూసేడు ఎస్.ఐ. రంగువెర్రగా, డాబుగా లేకున్నా మనిషిమాత్రం చాలా అందంగా ఉంది. వయసు తెచ్చిపెట్టిన పొంగుతో మెరుస్తోంది. స్టేషన్‌కు సామాన్యంగా ఆడాళ్ళెవరూ రారు, లాక్కు రాబడతారు. వాళ్ళు ఎంత బాగున్నా నలిపేసిన పువ్వుల్లా ఉంటారు — ఎండిన గులాబుల్లా ఉంటారు. కాలం చెల్లిన కొంపల్లా ఉంటారు. కానీ, ఈ పిల్ల అలాలేదు. రంగు ముదిరిన ఆపిల్ పండులా ఉంది. అప్పుడే విచ్చుకోబోతున్న మందారంలా ఉంది. ఎవడో ఏదో చేసేడంటే చెయ్యడా! పండును చూస్తే కొరకబుద్ధి వెయ్యదా!

"చెప్పు!" అన్నాడు ఎస్. ఐ.

చెప్పిందామె! కాలేజీలో చదువుతోంది. తల్లీ తమ్ముడూ తప్ప నా అన్నవారు లేరు. ఓ అద్దెల ఇల్లుతప్ప బ్రతుకుతెరువులేదు. ఆ అద్దెడబ్బుల మీదే ముగ్గురూ వెళ్ళదీస్తున్నారు. తన చదువు పూర్తయి ఉద్యోగం దొరికితే - వచ్చే ఏడాదినుంచీ ఇంకా బాగా బ్రతగ్గలుగుతారు.

"అవును సార్! బాగా చదువుతుంది! కాలేజీలో ఎప్పుడూ

క్లాసులే ! ఇంకెంత ! ఓ ఏడాదిలో ఉద్యోగం చేసెయ్యొచ్చు ! ఏ లోకాన్నున్నాడో ఆ బాబు సంతోషిస్తాడు !" అన్నాడు కాన్‌స్టేబుల్.

అంతవరకూ నిబ్బరంగా ఉన్న ఆ పిల్లకళ్ళు చెమ్మగిల్లేయి. "మా నాన్న ఈ స్టేషన్లోనే పనిచేసే వాడండీ !" అంది బిగబట్టుకుంటూ !

"అవును సార్ ! చెప్పనే లేదు. వీళ్ళ నాన్న మన స్టేషన్లోనే నాతో పనిచేసేవాడు. మీరు రావటానికి కొంచెం ముందే ఓ ఆక్సిడెంటులో పోయేడు !" అన్నాడు కాన్‌స్టేబుల్ !

ఎస్. ఐ. కు గుర్తుకొచ్చింది. అవును ! తను వచ్చిన కొత్తలో అందుకు సంబంధించిన కాగితాలు చూసేడు, సంతకాలు చేసేడు. ఈ కేసు సంత తేలిగ్గా వదిలేయ గూడదు. కాన్‌స్టేబుల్ కూతురి మీద చెయ్యేసిన వాణ్ణి క్షమించగూడదు. ఆ వెధవెవడో వాణ్ణి లాక్కొచ్చి, లాకప్‌లో వేయించాలి. ఈ పిల్ల కాళ్ళకు మొక్కించాలి ! వాడి మక్కెలు విరగ దన్నించాలి ! అర్నెల్లు గంజికూడు తినిపించాలి. జన్మలో మరే ఆడ పిల్లనూ కన్నెత్తి చూడకుండేట్లుగా పాఠం నేర్పాలి !

"ఎలా వుంటాడు వాడు ! గుర్తు పట్టగలవా ?" అడిగాడు ఎస్. ఐ.

"దున్నపోతులా వుంటాడండీ ! పెద్ద పెద్ద చెంపలూ, దుబ్బు జుట్టూ వాడూను. గుర్తుపట్టటానికేం ! మా ముందింట్లోనే వాడుండేది."

నవ్వొచ్చింది ఎస్. ఐ. కు. నచ్చనివాడు ఎవడయినా ఆడపిల్లకు దున్నపోతులాగే కనపడతాడు గాబోల్ను.

"ఏం చేస్తుంటాడు వాడు ?"

"వాళ్ళ మేడమీది ప్రక్కగది కిటికీలో కూర్చొని, మా దొడ్లోకీ బాత్రూంకేసీ చూస్తుంటాడండీ !"

"అదేమిటి ?"

"అవునండీ వాళ్ళ మేడ వెనకే మా పెంకుటిల్లు !"

"ఓహో !" అనుకున్నాడు ఎస్. ఐ. ఇందులో ఏదో కొంచెం ప్రేమ పురాణం లాంటిది కలిసి ఉన్నట్లుంది. అయితే అది వాడి వైపు నుంచే గాని, ఈ పిల్లవైపునుంచి ఉన్నట్టులేదు. ఆ మాటే పైకి అనేశాడు.

పళ్ళు కొరికిందా పిల్ల. రోషంతో మొహం బిగుసుకు పోయింది. "వాడో రౌడీ వెధవండీ ! రోజుకో ఆడపిల్ల వెంట పడుతూంటాడు. మా కాలేజీ చుట్టూ తిరుగుతూంటాడు, వాడికి ప్రేమ ఏమిటండీ ? వాడిబొంద !"

"సరే ! ఏం జరిగిందో చెప్పు, వివరంగా."

"వాడు మా యింటిమీద బాగా కన్నేసి ఉన్నట్లున్నాడండీ ! నిన్న సాయంత్రం ఇంట్లో ఒక్కత్తెనే ఉండగా చూసి పిల్లిలా లోపలికి దూరి తలుపు గెడ వేశాడండీ !

గుర్తుకొచ్చింది ఎస్. ఐ. కు. రాత్రి బార్‌లో పెద్దలుకూడా ఆడ పిల్లలు రాగానే ఆపసోపాలు పడుతూ లేచి ఒక్కొక్కరే చల్లగా, పిల్లుల్లా తలో గదిలోకి జారుకున్నారు వాళ్ళవెంట. తనొక్కడే బయట మిగిలి పోయేడు బిల్లులు లెక్కేసుకుంటూ.

"తర్వాత ?"

"వాడు ఏదో ఏడిసేడు ! నన్ను ప్రేమిస్తున్నాట్ట ! మన సినిమాల్లో వింటూంటామే - అలాంటి డైలాగులన్నీ బట్టీ పెట్టినట్టు వల్లించేడు."

"నువ్వేమన్నావు ?"

''మా అమ్మ మీ ఇంట్లోనే ఉందిగా ! ఆవిడతో మాట్లాడరాదా !" అన్నాను

"మీ అమ్మ వాళ్ళింట్లో ఎందుకుంది ?"

''రోజూ వెళ్ళినట్లే వెళ్ళిందండీ ? ఆవిడ వాళ్ళింట్లో వంటచేసి పెడుతుంది."

ఎస్. ఐ. నవ్వేడు. ప్రపంచం మారిపోతోంది. వంట మనిషి కూతుర్ని మేడగలవాడు లవ్ చేస్తున్నాడు. తనంతట వెళ్ళి ప్రాధేయపడుతున్నాడు. మరైతే వాడు తలుపు గెడ ఎందుకు వేసినట్టు ?

"అందుకు వా డే మన్నాడు ?"

"అదెలాగూ జరుగుతుందిగా ! ప్రస్తుతానికి ఓ ముద్దివ్వవా ?... ఒక్కసారి... ఒక్కసారి... అంటూ మీద పడబోయాడండీ !"

''నువ్వేం చేశావు ?"

''ఈడ్చి లెంపకాయ వేసి తలుపుకేసి చూపించానండీ !"

''అయితే, నువ్వే ముందుగా వాడిమీద చేయి జేసుకున్నావన్న మాట !"

"సార్ !" కాన్‌స్టేబుల్ బెరుగ్గానసిగేడు ''కానీ, వీళ్ళింట్లో అడుగు పెట్టినందుకు వాడే నేరస్తు డవుతాడు గదండీ !"

''అవునవును !" అన్నాడు ఎస్. ఐ.

''ఆ తర్వాతేమయింది ?"

"వాడు సంస్కారమున్న మనిషిలా లేడండీ ! ఏదేదో బ్రతిమాలుతూ మీద పడ్డాడు. ఆ పెనుగులాటలో నే నో మూలనున్న కత్తిపీట

మీద పడ్డాను. కొద్దిలో తప్పిపోయి చెయ్యి గీసుకుపోయిందిగానీ చెయ్యి తెగాల్సిం దసలు" అంటూ మోచేతిదగ్గర కత్తిగాటు చూపిందామె.

అదిపెట్టి వాడి నెత్తిన ఒక టిచ్చుకోక పోయావా? అనబోయి తన హోదా గుర్తుకొచ్చి ఆగిపోయేడు ఎస్. ఐ.

అతని భావాన్ని పసికట్టినట్లుగా అందామె: "చేతిమీద రక్తం చూడగానే ఆవేశం, మొండిధైర్యం ముంచుకు వచ్చాయండీ! ఆ కత్తిపీట పుచ్చుకుని వాడిమీద పడబోయానండీ!"

"శెభాష్!" అనలేదు ఎస్. ఐ.

"కానీ!" ఆగిందామె.

"ఎదురుగా గోడమీద ఫొటోలో గాంధీతాత నవ్వుతూ, మందలిస్తున్నట్లుగా కనిపించిందండీ!"

వాడెవడూ? అనబోయి ఎదురుగా గోడకున్న బోడిగుండుబొమ్మను చూసి "ఓహో!" అనుకున్నాడు ఎస్. ఐ.

"పైగా ఆ ప్రక్కనే యూనిఫాంలో ఉన్న మా నాన్నగారి ఫొటో కూడా ఉందండీ!"

"అయితే?"

"గాంధీగార్ని చూసి ఆగిపోయేనండీ! మా నాన్నగారి యూనిఫాం చూసి ఇలాంటి వాళ్ళ పని పట్టేందుకు మీరున్నారుగదా అని ఊరుకున్నానండీ?"

ఎస్. ఐ. సంతోషించేడు. ఈ పిల్ల తెలివిగలది. అంత ఆగ్రహాన్నీ అదుపులో పెట్టుకో గలిగింది. ఓ మర్డర్ కేసు తనదాకా రాకుండా

తప్పిపోయింది. గాంధీగారంటే ఏమో అనుకున్నానుగానీ మర్డర్లు జర రుక్కుండా అపు చేయగలవాడన్న మాట!

తన మెప్పుకోలును దాచుకోలేదు ఎస్. ఐ. "మంచిపని చేశావు అమ్మాయీ! అలాంటి దున్నపోతుగాళ్ళ పని పట్టేందుకే మేమున్నా మిక్కడ. వా డెక్కడున్నా లాక్కొచ్చి లాకప్‌లో పడేస్తాను. జైల్లోకి తోసి అర్నెల్లు జొన్నన్నం తినిపిస్తాను. రాస్కెల్‌కు చచ్చేదాకా గుర్తుండే పాఠం నేర్పుతాను. ఇంతకూ మీ ఇల్లెక్కడ? పద! చూద్దాం!" అంటూ లేవబోయాడు.

"మేన్‌రోడ్ చివర్న పెద్ద బంగళా లేదూ! దానివెనకే మా పెంకుటిల్లండీ! వాడా బంగళాలోనే దొరకవచ్చండీ!"

"వాడు ఆ బంగ్లాలోనే ఉంటాడా? వాడు అక్కడెందుకుంటాడు?"

"అది వాడిదే గదండీ! వాడి ఫాదర్ ఓ లీడరంటారు. వచ్చిపోయే కార్లతో, జీపుల్తో ఎప్పుడూ సందడిగా ఉంటుందండీ!"

బాంబు పేలినట్లయింది ఎస్. ఐ. నెత్తిమీద. మెయిన్‌రోడ్ చివర్న ఉన్న బంగ్లా సాక్షాత్తూ ఛైర్మన్‌గారిది. వా డీయన కొడుకుగానీ కాదు గదా?

"ఏ చివర్న ఉన్న బంగ్లా?" తడబడుతూ ప్రశ్నించేడు ఎస్. ఐ.

"అవతలి చివర్నేనండీ! తేలిగ్గానే గుర్తుపట్టొచ్చు! ఆ ఇంటాయన్నంతా ఛైర్మన్‌గా రంటూంటారు!"

స్తంభించిపోయేడు ఎస్. ఐ. అయిదు నిమిషాల్దాకా తేరుకోలేకపోయేడు!

"సరే! నువ్వెళ్ళు!" అన్నాడు చివరికి.

"కేస్ రిజిస్టర్లో సంతకం చేయించమన్నారా సార్?" కాన్‌స్టేబుల్ అడిగాడు.

మీ పీక కొయ్యమన్నారా సార్! అన్నట్లు వినిపించిందా మాట ఎస్. ఐ. కు.

"అదంతా తర్వాత చూద్దాంగానీ ముందీమెను ఇంటివద్ద దింపిరా! పెద్ద తలకాయల్తో కాస్త జాగ్రత్తగా ఉండాలని చెప్పు" అన్నాడు ఎస్.ఐ.

"వాడు మళ్ళీ ఇలాంటి దున్నపోతు పనులు చేయకుండా చూడాలండీ!" అందామె సందేహంగా. ఎస్. ఐ. గారి పాలిపోయిన మొహం చూస్తే ఏదో అర్థం అయినట్లుం దామెకు.

"దున్నపోతు" అనేమాట ఈసారి నవ్వు తెప్పించలేదు ఎస్.ఐ.కు. ఆ మాట మరీ కటువుగా ఉన్నట్లనిపించి తల పైకెత్తేడు.

కాన్‌స్టేబుల్‌కు సంగతి అర్థమయింది. సంజ్ఞచేసి ఆ పిల్లను బయటికి తీసుకుపోయేడు.

ఎస్. ఐ. తల పట్టుకు్కూలబడి పోయే డలాగే. మరో అరగంటకు కాన్‌స్టేబుల్ తిరిగి వచ్చేదాకా అతనలాగే ఉండిపోయేడు. జన్మలో మొదటిసారిగా పామునుచూసిన వాళ్ళా బెదిరిపోతున్నా డతను.

"చూడూ! మీ వాళ్ళమ్మాయే నంటున్నావుగా? ఆ పిల్లను కాస్త జాగ్రత్తగా వుండమను. ఛైర్మన్‌గారి అబ్బాయిమీద కేసంటే మాటలు కాదు. తన కనుకూలంగా వెయ్యిన్నొక్క సాక్ష్యాలు తేగలడు. మళ్ళీ మాట్లాడితే ఆ గొడవ జరిగిన టైముకు తాను ఏ మంత్రిగారింట్లోనో వాళ్ళ

ఫాదరుతో పాటు విందారగిస్తూన్నట్లుగా సర్టిఫికేటు కూడా వట్టుకు రాగ లడు !" అన్నాడు ఎస్. ఐ.

"ఎస్సర్ !" అన్నాడు కాన్‌స్టేబుల్.

"అయినా మనలోమాట! అంతగొప్ప ఛేర్మెన్‌గారి అబ్బాయి తనంతట వచ్చి పెళ్ళాడతానంటే ఈ పిల్ల ఎగిరి గంతేయాలిగానీ, కత్తిపీట పుచ్చుకోవట మేమిటీ ?" అమాయకంగా అడిగాడు ఎస్. ఐ.

జవాబుగా చేతిలో పేకెట్ ఒకటి టేబిల్ మీదుంచేడు కాన్‌స్టేబుల్ "మీకు ఇవ్వమని ఆ పిల్ల ఇచ్చిందండీ ?" అని శాల్యూట్ చేసి, నాడాలున్న బూటుకాలు మరోసారి నేలకేసి బాది, వెళ్ళిపోయేడు.

పాకెట్ ఏమిటో అర్థంగాలేదు ఎస్. ఐ. కు. బహుశా సాక్ష్యం కోసం పగిలిన గాజులో, చిరిగిన రవికో పంపి వుంటుందా పిల్ల, అను కుంటూ విప్పి చూసేడు.

చూసి తెల్లబోయేడు !

ముక్కలు ముక్కలయిన అద్దం, ఫ్రేములతో సహా బోసినవ్వుల గాంధీగారి పటం వుందందులో.

దాంతోపాటే వెలిసిపోయిన ఆ పిల్ల ఫాదర్ యూనిఫాంకూడా వుం దందులో.

అర్థం అయింది ఎస్ ఐ. కు. "పాపం ! పిచ్చిపిల్ల !" అనిమాత్రం అనుకోలేక పోయాడా క్షణాన్న ! (1973)

★